మ్యానిఫెస్టో మాయ

- ఏడాది గడిచినా అమలు కాని సూపర్ సిక్స్
- ప్రజల ఎదురు చూపులు
- మరోసారి మోసం చేశారని ఆగ్రహం



ఏలూరు (ఆర్ఆర్‌పేట): వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన హయాంలో మ్యానిఫెస్టోను ఒక పవిత్ర గ్రంథంలా భావించి అమలు చేశారు. ప్రజల విశ్వాసాన్ని పొందారు. ఎన్నికల సమయంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి పార్టీలు ఎన్నో ఆకర్షణీయమైన పథకాలను చేర్చి మ్యానిఫెస్టోను విడుదల చేశాయి. దీనికి ప్రజలు ఆకర్షితులై కూటమి పార్టీలను గెలిపించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయినా హామీలను పట్టించుకోవడంలేదు. దీంతో ప్రజలు కూటమి పార్టీలు ఇచ్చిన మాయ మ్యానిఫెస్టో అనే నిర్ధారణకు వచ్చేశారు.

పథకాల అమలెక్కడ?

కూటమి పార్టీల మ్యానిఫెస్టోలోని ప్రధానమైన సూపర్ 6 పథకాలు అమలుపై గంపెడాశలు పెట్టుకున్నారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు, లేదా నిరుద్యోగ భృతి, స్కూలుకు వెళ్ళే ప్రతి విద్యార్థికి ఏడాదికి తల్లికి వందనం పేరిట రూ.15 వేలు, ప్రతి రైతుకూ ఏటా రూ.20 వేల ఆర్థిక సాయం, ప్రతి ఇంటికీ ఉచితంగా గ్యాస్ సిలిండర్‌లు, ప్రతి మహిళకు నెలకు రూ.1500, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అంటూ ఊదరగొట్టారు. ఇవి కాక మరికొన్ని పథకాలను అమలు చేస్తామని ప్రచారం చేశారు. అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో ఇప్పటి వరకూ సూపర్ సిక్స్‌లోని ఒక పథకమైన ఉచిత గ్యాస్ సిలిండర్ కేవలం కుటుంబానికి ఒకటి ఇచ్చి పథకాలన్నీ అమలు చేసినట్టు ప్రచారం చేసుకుంటున్నారు.

మరోసారి మోసం

టీడీపీ కూటమి పాలకులు తమను మరోసారి మోసం చేశారని ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 2014 ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీనీ నెరవేర్చకుండా మోసం చేయడంతో 2019లో ప్రజలు వైఎస్సార్ సీపీని అందలమెక్కించారు. జగన్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలు చేయడంతో ప్రజలు పూర్తి స్థాయిలో ఆయనను నమ్మారు. అయితే 2024 ఎన్నికల సమయంలో కూటమి మరిన్ని ఆకర్షణీయమైన పథకాలను ప్రకటించడంతో వాటికి ఆకర్షితులయ్యారు. అయితే చంద్రబాబుపై ప్రజలకు విశ్వాసం లేకపోయినా అంతకు ముందు జగన్ చెప్పిన వన్నీ అమలు చేయడాన్ని చూసైనా చంద్రబాబు కూడా ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తారనే నమ్మకంతో కూటమిని గెలిపించారు. అయితే అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఒక్క పథకమూ అమలు చేకపోవడంతో చంద్రబాబు తమను మరోసారి మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వంపై ఆగ్రహం

గత ఎన్నికల నాటికి ఏలూరు నియోజకవర్గంలో 2,83,630 ప్రజలు ఉండగా వారిలో 1,40,114 మంది పురుషులు, 1,43,516 మంది మహిళలు ఉన్నారు. కాగా సూపర్ సిక్స్ పథకాలకు సంబంధించి పురుషులు, మహిళలకు కలిపి సుమారు 1.50 లక్షల మంది ఉంటారు. ఒక్క తల్లికి వందనం పథకానికి సంబంధించి నియోజకవర్గంలో 18 వేల మంది విద్యార్థులకు రూ.15 వేలు చొప్పున ప్రభుత్వం రూ.27 కోట్లకు పంగనామం పెట్టింది. ఈ నియోజకవర్గంలో సుమారు 30 వేల మంది నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి కింద ఇస్తామన్న రూ.9 కోట్లు ఎగవేసింది. సుమారు 43 వేల మంది 18 ఏళ్ల నుంచి 50 సంవత్సరాల్లోపు మహిళలకు నెలనెలా ఇస్తామన్న రూ.1500 చొప్పున 12 నెలలకు రూ.77.40 కోట్లు ఎగ్గొట్టింది. గ్యాస్ సిలిండర్ అయిపోయిన వెంటనే మరో సిలిండర్ ఇస్తారనుకుంటే ఏడాదికి మూడే ఇస్తామని అందులోనూ కోతపెట్టింది కూటమి ప్రభుత్వం. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీ ఇదిగో ఈ నెలే, వచ్చే నెలే అంటూ సాగదీస్తున్నారు తప్ప ఏడాది గడిచినా ఇప్పటి వరకూ ఆ పథకాన్ని అమలు చేయలేని అసమర్థ ప్రభుత్వంగా ప్రజల నుంచి ఛీత్కారాలు ఎదుర్కొంటోంది.

నెలనెలా రూ.1500 ఏది భయ్యా



మహిళలకు నెలనెలా ఇస్తానన్న రూ.1500 ఎప్పటి నుంచి ప్రారంభిస్తారు భయ్యా. ఇప్పటికే ఏడాది గడిచింది. అధికారంలోకి వచ్చిన నాటి నుంచే అమలు చేస్తే ఈ పాటికి రూ.18 వేలు వచ్చేది. మా కుటుంబ అవసరాలకు ఉపయోగపడేవి. పథకాలన్నీ అమలు చేస్తారని నమ్మకంతో ఓటు వేసినందుకు మమ్మల్ని మేము తిట్టుకోవాల్సిందే.

– షేక్ రజియా, గృహిణి

నిరుద్యోగ భృతి అమలు చేయాలి



నేను డిగ్రీ పూర్తి చేశాను. ఉద్యోగాలు లేక ఎక్కడైనా క్యాటరింగ్ ఆర్డర్లు ఉంటే ఆ పనికి వెళుతున్నాను. నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు ఇస్తాన్న భృతి రాలేదు. ఈ పథకాన్ని ఎప్పటి నుంచి అమలు చేసినా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి లెక్క పెట్టి బాకీ ఉన్న నెలలకు సంబంధించిన భృతిని కూడా ఇవ్వాలి.

– చట్టుమాల సునీల్ కుమార్, క్యాటరింగ్

క్లుప్తంగా

అశోక్ తేజకు ఘన స్వాగతం


అశోక్‌తేజకు స్వాగతిస్తున్న ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): శ్రమకావ్య గానం కార్యక్రమంలో పాల్గొనేందుకు ఏలూరుకు చేరుకున్న జాతీయ అవార్డు గ్రహీత, ప్రముఖ కవి, ఉత్తమ సినీ గేయ రచయిత, సుద్దాల అశోక్ తేజకు ఘనస్వాగతం లభించింది. సీఐటీయూ నాయకులు ఆర్. లింగరాజు, డీఎన్‌వీడీ ప్రసాద్ అశోక్‌తేజను ఆయన విడిది ప్రాంతంలో కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు వానపల్లి నాగరాజు, సీనియర్ న్యాయవాది చిక్క భీమేశ్వరావు, నేమాల రమేష్, నేమాల సత్యనారాయణ, భూపతి అప్పారావు, దోనే వెంకటేశ్వరరావు కలిసి ఆయనను అభినందనలు తెలిపారు.

దిగుమతి సుంకం పెంచాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ముడి పామాయిల్ దిగుమతి సుంకం పెంచాలని ఏలూరులో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న ముడి పామాయిల్ దిగుమతి సుంకాన్ని తగ్గించడాన్ని వ్యతిరేకిస్తూ, దిగుమతి సుంకాన్ని 40 శాతానికి పెంచాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, పామాయిల్ రైతుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో శనివారం ఈ సమావేశం ఏపీ రైతు సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షుడు పుల్లారి సోమశేఖరాచార్యులు అధ్యక్షతన నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ మిల్లర్లకు, దళారులకు వ్యవసాయ ఉత్పత్తులను అమ్మకం చేసుకున్న తర్వాత ప్రభుత్వాలు ధర నిర్ణయించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. టన్ను పామాయిల్‌కు రూ.22 వేలు మద్దతు ధర ప్రకటించి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. పలు సంఘాల నేతలు కేవీవీ ప్రసాద్, పి.జమలయ్య, ఆర్.లక్ష్మణరావు, డి.ప్రభాకర్, ఎం.వసంతరావు, కె.నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు బాలు 79వ జయంతి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 79వ జయంతి కార్యక్రమాన్ని ఆదివారం నగరానికి చెందిన ఎస్‌పీఎస్ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు ఆ సంస్థ వ్యవస్థాపకుడు ఎస్‌పీఎస్ వాసు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో సాయంత్రం 5 గంటల నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమౌతుందని పేర్కొన్నారు. బాలు నోట బాలల పాట అనే అంశంలో ఎస్‌పీఎస్ ఎస్‌పీఎస్ దీప్‌చంద్, మ్యూజిక్ అకాడమీ విద్యార్థులు, ఎస్‌పీఎస్ పాడనా తీయగా చిన్నారులు తమ గానాలతో అలరిస్తారని తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన వెంకటప్పయ్య


కలెక్టర్ వెట్రిసెల్వికి మొక్కను అందిస్తున్న వెంకటప్పయ్య

ఏలూరు(మెట్రో) : ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్-2గా బాధ్యతలు స్వీకరించిన ఎం వెంకటప్పయ్య శనివారం కలెక్టరేట్లో కలెక్టర్ కె.వెట్రిసెల్విని మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందించారు. డీఈఓ వెంకటలక్ష్మమ్మ, సర్వశిక్షా అభియాన్ ఏపీ సి.పంకజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

9న ఆయిల్ పామ్ రైతుల ధర్నా

ఏలూరు(ఆర్ఆర్‌పేట): పామాయిల్ దిగుమతులపై సుంకం 50 శాతం పెంచి ఆయిల్ పామ్ రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 9న ఏలూరు జిల్లా కలెక్టరేట్ వద్ద ఆయిల్ పామ్ రైతులు నిర్వహిస్తున్న ధర్నాకు సంపూర్ణ మద్దతు ప్రకటించినట్లు సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ తరపున ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం ముడి పామాయిల్ దిగుమతి సుంకం 10 శాతం తగ్గించడం వల్ల ఆయిల్ పామ్ గెలల ధరలు తగ్గిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పెరిగిన ఉత్పత్తి ఖర్చులరీత్యా టన్ను ఆయిల్ పామ్ గెలలు రూ.22 వేలు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. పెదవేగి ఆయిల్ షెడ్ కర్మాగారం ప్రైవేట్ పరం చేయాలని ఆలోచన వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

కుల గణన హేతుబద్ధంగా నిర్వహించాలి


బీసీల ఐక్యతను సూచిస్తూ చేతులు కలిపిన నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలో సగానికి పైగా బీసీ జనాభా ఉన్నారని అందుకు తగ్గట్టుగా కులగణన హేతుబద్ధంగా వెంటనే నిర్వహించాలని బీసీ జేసీ నాయకుడు లంకా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక యాదవ సంఘ భవనంలో ఆంధ్రప్రదేశ్ బీసీ జేఏసీ ఆధ్వర్యంలో లంకా వెంకటేశ్వర్లు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 శాతానికి పైగా ఉన్న బీసీ జనాభా ఉన్నందున బీసీలకు రిజర్వేషన్లు పెంచాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ వర్గీకరణ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సగర సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు తాడిశెట్టి గోపిరావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం పరిధి నుంచి బీసీలను తప్పించాలని, విముక్త జాతులకు ప్రత్యేక ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. దొమ్మర సంక్షేమ సంఘం అధ్యక్షుడు అన్నపురెడ్డి మురళి మాట్లాడుతూ సంచార తెగల విద్యార్థులకు ప్రతి జిల్లాలో రెసిడెన్షియల్ పాఠశాలలు నెలకొల్పాలని కోరారు. గతంలో రజకుల అభివృద్ధిపై చర్చించడానికి కలెక్టర్ అధ్యక్షతన ఉన్న మానిటరింగ్ సెల్‌ను పునరుద్ధరించాలని రజక నాయకుడు లక్ష్మణ్ కుమార్ కోరారు. జంగమ కుల సంక్షేమ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని జంగమ నాయకుడు మగటం మురళీమోహన్ కోరారు. బీసీలకు ఆధ్యాత్మిక చైతన్యం అందించిన ఏకైక సంస్కర్త పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహం ఏలూరులో ఏర్పాటు చేయాలని విశ్వబ్రాహ్మణ సంఘ నాయకుడు కొత్తల శివ కుమార్ కోరారు. ఎంబీసీ ఉద్యమ నాయకుడు సుధాకర్, కేవీపీ మాధవ రావు తదితరులు మాట్లాడారు. ఆయా సంఘాల ప్రతినిధులు వివరించిన సమస్యలను ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కు నివేదిస్తామని జేఏసీ ఉపాధ్యక్షుడు ఉక్కుసూరి గోపాలకృష్ణ స్పష్టం చేశారు. సమావేశంలో వివిధబీసీ సంఘాల నాయకులు పరసా శ్రీనివాస్, లక్కోజు రాజగోపాలాచారి, ఎం. సూర్య నారాయణ, కే. రాజు, ఎం. నరేంద్ర తదితరులు పాల్గొనగా బీసీ జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మార్గాని శ్రీనివాస్ వందన సమర్పణ చేశారు.

ఇంటర్ డిపార్ట్‌మెంటల్ క్రికెట్ పోటీలు ప్రారంభం


బ్యాటింగ్ చేస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి, బౌల్లింగ్ వేస్తున్న ఎస్పీ ప్రతాప శివ కిషోర్

దెందులూరు: నాషా ముక్త్ భారత్ అభియాన్ ప్రచార కార్యక్రమంలో భాగంగా శనివారం ఏలూరు రూరల్ మండలం పాలగుడెంలోని ఆశ్రమం మెడికల్ కళాశాల క్రికెట్ మైదానంలో రెండు రోజుల ఇంటర్ డిపార్ట్‌మెంటల్ క్రికెట్ పోటీలను జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ప్రారంభించారు. అనంతరం ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడిన కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ క్రీడాకారులను ప్రోత్సహించారు. తొలుత పోటీలో పాల్గొంటున్న ఆరు జట్ల క్రీడాకారులను కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ పరిచయం చేసుకున్నారు.

అవగాహన కల్పించాలి

కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ డ్రగ్స్ వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలను ప్రజలకు వివరించడంతో పాటు మాదక ద్రవ్యాల అమ్మకం, రవాణా వంటి అక్రమ కార్యకలాపాలకు ఎవరు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా నిర్మూలనకు కేంద్ర ప్రభుత్వం నషాముక్త్ భారత్ అభియాన్ ద్వారా ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. మాదక ద్రవ్యాల సమాచారాన్ని 1972, 14446 టోల్ ఫ్రీ నెంబర్లకు అందించాలని సూచించారు. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా ఉండేలా అన్ని పాఠశాలలు, కళాశాలల్లో మాదకద్రవ్యాల వినియోగం కారణంగా కలిగే దుష్ప్రభావాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఎస్పీ ప్రతాప శివకిషోర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడం అందరి బాధ్యతని అన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల బారిన పడకుండా యువతను వివిధ క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకునేలా చైతన్య పరచాలని సూచించారు. గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలు రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టామని, గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలు రవాణా చేసే వారిపై కఠినమైన శిక్షలు పడేలా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా మీడియా, రెవెన్యూ జట్ల మధ్య తొలి మ్యాచ్ నిర్వహించగా, టాస్ గెలిచి రెవెన్యూ టీమ్ ఫీల్డింగ్ ఎంచుకుంది. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల, వయో వృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వి.రామ్ కుమార్, డీఎస్‌ఓ బి.శ్రీనివాసరావు, సెట్ వెల్ సీఈఓ ప్రభాకర్, ఎన్‌జీఓ నాయకులు చోడగిరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	24	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	36	చిక్కుడు కాయలు	90
వంకాయలు (కాంతులు)	48	బీట్లచిక్కుడు	--
వంకాయలు (తెలుపు)	36	చామదుంపలు	46
బెండకాయలు	30	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	32	కంద	--
కాకర కాయలు	46	బీట్‌రూట్	36
బీరకాయలు	30	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	44	ఫ్రెంచ్‌బీన్స్	128
క్యాబేజీ	22	అల్లం	64
క్యారెట్	42	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	28	పాలకూర	12
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	24	చుక్కకూర	12
గోరుచిక్కుడు	44	గోంగూర	07-10
దోసకాయలు	20	పుదీనా	05
ఆనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	00
ఏలూరు - జీడిమెట్ల (ఖమ్మం) (ఇంద్ర)	20.15	00
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	00
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	01
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	00
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	02
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	01
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	00
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	00
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	00
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	01
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.00	98516	34
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.40	98507	34
ఏలూరు - తిరుపతి	16.00	4830	34

ఫారెస్ట్ బేస్ క్యాంపు హెల్పర్లను ఢీ కొట్టిన వాహనం


క్షతగాత్రులను ఆసుపత్రి తీసుకువెళ్తున్న దృశ్యం

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం గుడివాడలంక సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఫారెస్ట్ బేస్ క్యాంప్ హెల్పర్స్‌ను బొలెరో వాహనం ఢీ కొట్టి ఆగకుండా వ్యాన్ డ్రైవర్ వెళ్లిపోయాడు. ఈ ఘటనలో ఫారెస్ట్ బేస్ క్యాంప్ హెల్పర్స్ జి.నాగన్న, ఎస్ సహదేవుడుకు తీవ్ర గాయాలయ్యాయన్నారు. బాధితులను కుటుంబ సభ్యులు, బంధువులు స్థానికులు హుటాహుటిన ఏలూరులోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వారు చికిత్స పొందుతున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

కూలీలకు పే స్లిప్పులు ఇవ్వాలి

జంగారెడ్డిగూడెం: ఉపాధి కూలీలకు పే స్లిప్పులు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జంగారెడ్డిగూడెం మండల కార్యదర్శి అందుగుల ప్రభాకర్‌రావు అధికారులను కోరారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో సంఘం మండల అధ్యక్షురాలు యాగంటి సీత అధ్యక్షతన నిర్వహించిన సంఘం మండల కమిటీ సమావేశంలో ప్రభాకర్ రావు, జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం మాట్లాడారు. ఎండల తీవ్రత దృష్టిలో ఉంచుకుని ఉపాధి కూలీల పని సమయం ఉదయం 6 నుంచి 9 గంటల వరకు నిర్ణయించాలన్నారు. కూలీల సమస్యలు పరిష్కరించాలని, వేతన బకాయిలు తక్షణమే విడుదల చేయాలని కోరారు. ఎండల తీవ్రతకు మృత్యువాతకు గురైన కూలీలకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. పాతపద్ధతిలో మంచినీరు మజ్జిగ మెడికల్ కిట్లు నీడకు టెంట్లు ప్రతి పని ప్రదేశాల్లో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్ ప్రార్థనలు


జామియా మసీదులో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న జయప్రకాష్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): త్యాగాలకు ప్రతీక అయిన బక్రీద్ పండుగను శనివారం నగరంలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈద్‌గాహ్, కర్బలా మైదానాలు, పలు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరిని ఒకరు ఆలింగనం చేసుకుని పరస్పరం ఈద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పాత బస్టాండు సెంటర్‌లోని కర్బలా మైదానంలో అంజుమన్ ముహాఫిజుల్ ఇస్లాం సంస్థ ఆధ్వర్యంలో ఉదయం 8 గంటలకు ప్రార్థనలు చేశారు. స్థానిక గేట్ మసీదు పేష్ ఇమామ్ అబ్దుల్ రవూఫ్ ప్రార్థనలు నిర్వహించి బక్రీద్ పండుగ విశిష్టతను వివరించారు. ఉదయం 9.30 గంటలకు వంగాయగూడెం రోడ్డులోని ఈద్‌గాహ్‌లో ప్రభుత్వ ఖాజీ షేక్ హుస్సేన్ ప్రార్థనలు చేశారు. ఖుర్‌ఆన్ గ్రంథ పారాయణం చేశారు. బక్రీద్ త్యాగాలకు ప్రతీక అని ప్రవక్త అడుగుజాడల్లో ప్రతి ముస్లిం నడవాలని, సాటి వారిని సోదర భావంతో ఆదరించి, మత సామరస్యానికి ప్రతీకగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బడేటి చంటి పాల్గొని ముస్లింలను ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు. నగరానికి ఆధ్యాత్మిక చింతనలో ప్రత్యేక స్థానం ఉందని, ఏ మతానికి చెందిన వారైనా ఇతర మతాలను ఆదరిస్తూ సోదర భావంతో మెలగడం ఏలూరు నియోజకవర్గానికి ఉన్న ప్రత్యేకత అని అన్నారు. ఎస్‌ఎం ఆర్ పెదబాబు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

నగరంలో ఆధ్యాత్మిక ప్రభ

12వ డివిజన్‌లోని జామియా మసీదులో జరిగిన బక్రీద్ ప్రార్థనల్లో పాల్గొన్న వైఎస్సార్ సీపీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయ ప్రకాష్ ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. దైవ ప్రవక్త ఇబ్రహీం త్యాగాన్ని స్మరించుకుంటూ త్యాగానికీ, విశ్వాసానికి, కరుణకు, ఐక్యతకు ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించడం నగరంలో ఆధ్యాత్మిక ప్రభలను వెలిగిస్తోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గుడిదేశి శ్రీను, నెరుసు చిరంజీవులు, కిలాడి దుర్గారావు, దాసరి రమేష్, పల్లెల బాలకృష్ణ, బండమూడి సునీల్ తదితరులు పాల్గొని గౌస్ మొహిద్దీన్, జామియా మసీదు ప్రెసిడెంట్ ఇలాయాస్ పాషి, సెక్రటరీ మునిస్ షరీఫ్, కరీంలతో పాటు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.


ఈద్‌గాహ్ ప్రాంగణంలో బక్రీద్ సమాజ్ ప్రార్థనలు

9న ఏలూరులో యోగాంధ్ర ర్యాలీ

ఏలూరు (మెట్రో) : జిల్లాలో యోగాను ప్రజలకు మరింత చేరువ చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశపు హాలులో శనివారం యోగాంధ్ర కార్యక్రమాలపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ నెల 9న ఉదయం 7 గంటలకు ఏలూరులో సీఆర్ రెడ్డి పబ్లిక్ స్కూల్ నుంచి ఇన్‌డోర్ స్టేడియం వరకు యోగాంధ్ర కార్యక్రమంపై అవగాహన ర్యాలీ ఉంటుందన్నారు. ఈనెల 10న జంగారెడ్డిగూడెంలో మద్ది ఆంజనేయస్వామి గుడి వద్ద, 18న జీలకర్రగూడెంలోని గుంటుపల్లి గుహల వద్ద యోగాభ్యాసన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈనెల 13న ఏలూరులోని సర్ సీఆర్ రెడ్డి డిగ్రీ కళాశాల గ్రౌండ్స్‌లో జిల్లా స్థాయిలో యోగాభ్యాసన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు హాజరవుతారని, ప్రజలు పెద్దఎత్తున భాగస్వాములయ్యేలా అధికారులు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఏలూరు కమిషనర్ భానుప్రతాప్, ఇరిగేషన్ ఎస్‌ఈ నాగార్జునరావు, జిల్లా సహకార అధికారి ఎ.శ్రీనివాస్, డీఈఓ వెంకటలక్ష్మమ్మ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎం.ముక్కంటి, వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి ఆర్‌వీ నాగరాణి, డీఎస్‌ఓ శివరామమూర్తి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ త్రినాథ్‌బాబు, మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ పీడీ రవికుమార్, డీఎస్‌డీఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.